క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం



నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగంగాపర్వతవర్ధనీ సమేత రామలింగశ్వరస్వామి దేవస్థానంలో ధ్వజస్తంబ ప్రతిష్ట మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్టను గ్రామమంతా పండుగలా జరుపుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులు వేడుకకు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది. ధ్వజస్తంభం ప్రతిష్టిస్తుండగా భక్తుల శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. ప్రతిష్ట మహోత్సవం అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

విశేషపూజల్లో మంత్రి అంబటి..

చల్లగుండ్ల గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం ధ్వజస్తంబ ప్రతిష్టామహోత్సవంలో మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

అచ్చంపేట ఎంపీడీఓగా శివసుబ్రమణ్యం



అచ్చంపేట: అచ్చంపేట ఎంపీడీఓగా ఎల్ఎస్ శివ సుబ్రమణ్యం గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వీరు పొన్నూరు మండలంలో ఈఓపీఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై అచ్చంపేట మండలానికి ఎంపీడీఓగా చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరు ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిస్పక్షపాతంగా అర్హులకు చేరవేయడంలో చొరవ చూపిస్తానన్నాను. అందరికి అందుబాటులో ఉంటు ప్రభుత్వ ఆకాంక్షమేరకు పనిచేస్తానని చెప్పారు.

ఈఓపీఆర్డీగా శ్రీనివాసరావు



పెదకూరపాడు: ఈఓపీఆర్డీగా శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా శ్రీనివాసరావు అచ్చంపేట నుంచి పెదకూరపాడు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పూర్ణచంద్ర రావు చిలకలూరిపేటకు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు.

మాదలలో ఫ్యామిలీ ఫిజీషియన్

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో వైద్యులు సాయితేజరెడ్డి పాల్గొని 121 మందికి వైద్యసేవ లందించారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్ళి అవసరమైన వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డీఈఓ రవితేజ, ఎమ్పీహెచ్ఎస్ రవిచంద్రబాబు, ఏఎన్ఎమ్ వెంకటరామమ్మ, ఆశ, అంగన్వాడీ కార్యకార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి కల్యాణమహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ద్వితీయ వార్షికోత్సవం, శ్రవణానక్షత్రం పురస్కరించుకుని కల్యాణవేడుక జరిపించారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. స్వామివారిని, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.

జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం

అమరావతి: ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు బడులు తెరవక ముందే నాలుగవ సంవత్సరం జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్లో జగనన్న విద్యాకానుక సంబందించిన వస్తువులను మండల పరిదిలోని వివిధ పాఠశాలలకు తరలించారు. విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన స్కూల్బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్, మూడు జతల యూనిఫాం, ఒకజత బూట్లు. రెండు జతల సాక్స్లు, బెల్టలను పాఠశాలలకు పంపి అక్కడ నుంచి విద్యార్థులకు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని 41 ప్రాథమిక పాఠశాలలో, 7 ఉన్నత పాఠశాలలో, 9 ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న 4928 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక ద్వారా 52 వేల పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటికే 40 వేల పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు విద్యాశాఖాధికారులు పంపడం జరిగింది. ఈనెల 12వతేదీ నాడు బడులు తెరిచే నాటికి మిగిలిన 12వేల పుస్తకాలను పాఠశాలలకు చేర్చడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విదాశాఖాధికారులు తెలిపారు.

ఉపాధి కల్పనలో అచ్చంపేట అగ్రస్థానం

- క్లస్టర్ పరిధిలో రోజు 45 వేల మందికి పైగా కూలీలు హాజరు
- మే మాసంలో నూరు శాతం పైగానే పని దినాలు
- వలసలకు అడ్డుకట్ట వేసిన రాష్ట్ర ప్రభుత్వం

సత్తెనపల్లి: కూలీలకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అడిగిన ప్రతి కూలీకి తప్పనిసరిగా పని చూపించి కొండంత భరోసా కల్పిస్తోంది. సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించి పారదర్శకంగా పథకం అమలు చేస్తుండడంతో కూలీలు ఉన్న ఊరిలోనే పనులు చేసుకుంటున్నారు. చేసిన పనికి తగిన వేతనం సకాలంలో అందుతోంది. దీంతో వలసలకు పూర్తిగా చెక్ పడినట్లయ్యింది. క్లస్టర్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో రోజుకు 45,800 మంది కూలీలు పనలకు హాజరౌతున్నారు. రోజుకు 46 వేల మందికి ఉపాధి కల్పిస్తేనే లక్ష్యం చేరుకునే అవకాశం ఉండగా ప్రస్తుతం 45,800 మంది ఉపాధి పొందుతున్నారు. డ్వామా కింద పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి క్లస్టర్లో పని దినాల కల్పనలో అచ్చంపేట మండలం 239 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. క్రోసూరు 179 శాతంతో ద్వితీయ స్థానం, నకరికల్లు 162 శాతంతో తృతీయ స్థానంలో నిలవగా, బెల్లంకొండ 158 శాతం, రాజుపాలెం 145 శాతం, అమరావతి 121 శాతం, సత్తెనపల్లి 109 శాతం, ముప్పాళ్ళ 108 శాతం, పెదకూరపాడు 80శాతంతో ఆఖరి స్థానంలో నిలిచింది.కనీస వేతనం
రూ.272 కాగా సగటున రూ.246 కూలీ లభిస్తోంది. క్లస్టర్లో 46,352 కుటుంభాలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నాయి. ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించాలని లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు 62 కుటుంబాలకు వంద రోజులు పని కల్పించారు.



అనుపాలెంలో కూలీలలతో చర్చిస్తున్న పీడీ జోసఫ్కుమార్

క్లస్టర్లో మండలాల వారీగా మే నెలలో ఉపాధి పనులు లక్ష్యం, సాధన....

మండలం	లక్ష్యం	సాధించింది	శాతం
సత్తెనపల్లి	1,61,048	1,76,344	109
ముప్పాళ్ళ	56,181	61,110	108
రాజుపాలెం	1,13,220	1,64,861	145
నకరికల్లు	54,464	87,321	162
పెదకూరపాడు	1,18,324	94,919	80
అమరావతి	69,105	84,104	121
అచ్చంపేట	54,644	1,30,687	239
క్రోసూరు	66,456	1,19,440	179
బెల్లంకొండ	83,291	1,31,981	158

46,352 కుటుంబాల భాగస్వామ్యం ....

క్లస్టర్లో 96,623 కుటుంబాలకు జాబ్కార్డులు ఉండగా 46,352 కుటుంబాలు ఉపాధి పనుల్లో భాగస్వామ్యులు అవుతున్నారు. తద్వారా 78,722 మందికి ఉపాధి పొందే అవకాశం ఉంది. క్లస్టర్లో 2022–24లో ఏప్రిల్ మాసానికి 4,68,983 మందికిగాను 3,04,474 మందికి పని కల్పించారు. వ్యవసాయ పనులు కారణంగా తక్కువ మంది హజరయ్యారు.మే మాసంలో 7,76,753 పని దినాలు కల్పించాల్సి ఉండగా 10,48, 935 పని దినాలు కల్పించారు.

ఏరోజు కారోజు క్షేత్రస్థాయి పరిశీలన



ఉపాధి హామీ పథకంలో ఎక్కువ మంది కూలీలకు పని కల్పించే దిశగా చర్యలు తీసు కుంటున్నాం. ఏరోజు కారోజు ఏపీఓలు క్షేత్రస్థాయి సిబ్బందితోనూ చర్చిస్తున్నాం. మార్చిలో వ్యవసాయ పనులు ఉండడంతో కొన్ని ప్రాంతాల్లో కూలీల సంఖ్య తక్కువగా ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా నిర్దేశించిన పనిదినాల సంఖ్యను చేరుకుంటాం. కనీస వేతనం రూ. 272 దక్కేలా ఎక్కువ సమయం పని చేయాలని కూలీలకు సూచిస్తున్నాం. కూలీలు అవగాహన చేసుకుని పని చేయాల్సి ఉంటుంది. ఐ

–పీ.వెంకట నారాయణ, ఇన్చార్జ్ ఏపీడీ, సత్తెనపలి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

రాజుపాలెం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి అధ్యక్షతన సర్వసభ సమావేశం గురువారం నిర్వహించారు. సర్వసభ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి విద్యావ్యవస్థలోను, ఆరోగ్యరంగంలోను అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టారన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా పాఠశాలల్లో నాడు–నేడు అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి విద్యకు పాధాన్యతనిచ్చారన్నారు. విద్య ఉంటే ప్రపంచంలో ఎక్కడైన స్థిరపడవచ్చని తెలిపారు. దానికి అణుగుణంగా పాఠశాలల్లో ఇంగ్లిషుమీడియం ప్రవేశపెట్టిన ఘనత జగన్దేనని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్రెడ్డి ఫీజ్ రియంబర్స్మెంట్ ప్రవేశ పెట్టడం ద్వారా పేద వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అనేక రంగాల్లో స్థిరపడ్డారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ రైతుల, మహిళల పక్షపాత ప్రభుత్వమని తెలిపారు. ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాల పంపిణీలో స్థానిక ప్రజా ప్రతినిధులు భాగస్వాములు అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముందుగా మండల స్థాయి అధికారులు వారి శాఖల పనితీరు, వారి శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సునీతశ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంఈఓ మల్లిఖార్జునశర్మ, డాక్టర్ కృష్ణకుమార్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

సత్తెనపల్లి: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గత నెల 31న ఇచ్ఛాపురంలో బయలుదేరిన మున్సిపల్ కార్మికుల రాష్ట్ర జాత రాష్ట్రంలో అనేక పట్టణాల్లో పర్యటిస్తూ గురువారం సత్తెనపల్లి పట్టణానికి చేరుకున్నది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులను కలుసుకుని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సత్తెనపల్లి మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని రాష్ట్రస్థాయిలో మే 31వ తేదీ నుంచి రాష్ట్ర మొత్తం పర్యటించి గురువారం విజయవాడ చేరుకోవడం జరుగుతుందన్నారు. జాతాలో సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మీ, గంగారావులు పాల్గొనగా కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు వంగిపరపు చంద్రకళ, సత్తెనపల్లి యూనియన్ కార్యదర్శి కమల, సిఐటియూ మాజీ జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్, సత్తెనపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మాజీ గౌరవ అధ్యక్షులు మామిడి జగన్నాధ రావు, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం హరిపోతు రాజు, నాయకులు రొంపిచర్ల పురుషోత్తం,నాయకులు షేక్ సైదులు, మంద సైదేశ్వర రావు,జడ రాజ కుమార్, ధరణికోట పుల్లారావు,అనుముల వీర బ్రహ్మం, కట్టా శివ దుర్గారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు

మాతా, నవజాత శిశువుల సంరక్షణకు సీసీపీ

- ప్రోగ్రామ్ అసోసియేట్ డాక్టర్ తనూజ
- సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో సీసీపీ ప్రారంభం

సత్తెనపల్లి: మాతా, నవజాత శిశువుల సంరక్షణ, ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కేర్ కంపానియన్ ప్రోగ్రాం (సీసీపీ)ను ఏరియా వైద్యశాలలు, జిల్లా వైద్యశాలల్లో అమలు చేయడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, నూరా హెల్త్ చేతులు కలిపాయని ప్రోగ్రామ్ అసోసియేట్ డాక్టర్ తనూజ అన్నారు. ఈ కార్యక్రమం అమలులో భాగంగా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు నూరా హెల్త్ నుంచి డాక్టర్ తనూజ, డాక్టర్ శంకర్ గురువారం హాజరయ్యారు. నూరా హెల్త్ వారు ప్రత్యేకంగా వైద్యశాలలో మాధవి, సునీత, లలిత్ కుమారి ముగ్గురు స్టాఫ్నర్స్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారు గర్భిణులకు రోజు శిక్షణ ఇస్తారు. అలవాట్లు, ఎలా కూర్చోవాలి, ఎలా లోపల ఉన్న శిశువుకి ఇబ్బందులు లేకుండా ఎలాంటి ఎక్సర్సైజులు చేయాలి అనే అంశాల పై తర్ఫీదు ఇస్తారు. ప్రసవం అయిన తర్వాత బేబీకి ఎలాంటి ఫీడింగ్ ఇవ్వాలి? వారికి వచ్చే చిన్న చిన్న సమస్యలు పెద్దవి కాకుండా ముందుగానే పసికట్టి వాటిని నివారణ చర్యలు తీసుకునే విధంగా ఈ శిక్షణ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ ప్రోగ్రాములు వల్ల నవజాతి శిశువులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆహారం ఇచ్చే పద్ధతులు, అలవాట్లు ఇక్కడ స్టాఫ్ నర్స్ నేర్పిస్తారన్నారు. దాంతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా కౌన్సిలింగ్ ఏర్పాటు చేసి పుట్టిన పిల్లలకు ఇబ్బంది లేకుండా ఈ శిక్షణ ప్రోగ్రామ్ నిర్వహిస్తారని తెలియజేశారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ నూరా హెల్త్ ఎన్జీవోతో ఇలాంటి మంచి శిక్షణ కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో మంచి నిర్ణయాలు తీసుకుందన్నారు. దీని వల్ల గర్భిణీ స్త్రీలకు వచ్చే ప్రమాదాలను ముందుగానే పసికట్టువచ్చనన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత పాలు ఇచ్చే విధానం నుంచి 11 రోజులు వరకు ఆ చిన్న పిల్లలతో ఎలా ఉండాలి అనేది ఈ శిక్షణ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇలాంటి మంచి కార్య క్రమాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టి ఎంతో మంది తల్లులి్, పిల్లలను జాగ్రత్త గా వహించేలా చేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో వైద్యశాలలోని వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఎంఎంఓలు, పాల్గొన్నారు.



సీసీపీ పై బ్రోచర్ చూపుతూ మాట్లాడుతున్న ప్రోగ్రామ్ అసోసియేట్ డాక్టర్ తనూజ

జెడ్పీపాఠశాల హెచ్ఎంగా శ్రీనివాసరెడ్డి



పెదకూరపాడు: 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా శ్రీనివాసరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా శ్రీనివాసరెడ్డి అమరావతి మండలం మునుగోడు జెడ్పీ పాఠశాల నుంచి 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న అంకాల శాంతా భూలక్ష్మి మందపాడు జెడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నూతన విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయుల బృందంతో కలిసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ గుత్తికొండ అంజిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డిలు అభినందనలు తెలిపారు.

క్రోసూరు ఎంపీడీఓగా మహేష్



క్రోసూరు: క్రోసూరు ఎంపీడీఓగా బిక్కి మహేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. తాడికొండ ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మిన్స్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై క్రోసూరుకు వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలన్ని ప్రజలకు చేరే విధంగా అందుబాటులో ఉంటానని ఈసందర్భంగా ఎంపీడీఓ తెలిపారు. ఇప్పటి వరకు ఇన్చార్జి ఎంపీడీఓగా ఈఓఆర్డీ పి.శివరామయ్య బాధ్యతలు నిర్వహించడం జరిగింది.

ఏపి మోడల్స్కూల్ ఆరవతరగతి ప్రవేశపరీక్ష కేంద్రం మార్పు

క్రోసూరు: క్రోసూరులోని ఏపి మోడల్స్కూల్లో ఈనెల 11 వతేదీన(ఆదివారం) ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు పరీక్ష కేంద్రంలో మార్పు చేసినట్లు ప్రిన్సిపల్ ఎం.మేరీసుజన్ గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె తెలుపుతూ ఏపి మోడల్స్కూల్ పరీక్ష కేంద్రంగా ఉండేదని అయితే సీఎం జగన్ పర్యటన ఏర్పాట్ల హడావిడి కారణం దృష్ట్యా క్రోసూరులోని కస్తూరిబాగాంధీ పాఠశాల(కేజీబీవీ) లో పెట్టినట్లు తెలియజేశారు. అందుకుని ప్రవేశపరీక్షకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. పరీక్ష సమయం, తేదీల్లో ఎటువంటి మార్పు లేదని వివరించారు. 11 వతేదీ ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని 12 గంటలకు పరీక్ష ముగుస్తుందన్నారు. విద్యార్థులు 8.30 గంటలకల్లా కేజీబీవీ పరీక్ష కేంద్రానికి హాల్టిక్కెట్, బ్లూబాల్పాయింట్ పెన్, ప్యాడ్ వెంట తప్పనిసరిగా తెచ్చుకోవాలని కోరారు. కావున తల్లిదండ్రులు ఈవిషయాన్ని గమనించి పరీక్ష కేంద్రం మార్పుకు సహకరించాలని కోరారు.

మలేరియా బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఉడతా శ్రీలక్ష్మీ కవిత

సత్తెనపల్లి: మలేరియా విష జ్వరాల బారిన పడకుండా ఆశ ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఉడతా శ్రీలక్ష్మి కవిత అన్నారు. సత్తెనపల్లి మండల పరిధిలోని ఫణిదం పి.హెచ్.సి. నందు మలేరియా నివారణ మహోత్సవ అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ శ్రీలక్ష్మీ కవిత మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా డ్రైనేజీలో నీటి నిల్వలను లేకుండా అరికట్టాలన్నారు. ఆశ ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి ఆరోగ్య కేంద్రాల వద్ద మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సబ్ యూనిట్ అధికారి మొఘల్ శుభాన్ బేగ్, సీహెచ్.ఓ.సీతారావమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు పి.వెంకటరావు, ఓ.మహమ్మద్ ఖదీర్, సూపర్ వైజర్స్ ఏఎన్ఎమ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ట మహోత్సవాలు

అచ్చంపేట: మండలంలోని పెదపాలెం, మిట్టపాలెం గ్రామాల్లో నూతన దేవాలయాలు, దేవతా మూర్తుల ప్రతిష్ట మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. కార్యక్రమాలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవ నిర్వాహకులు, వేదపండితులు శంకరరావు దంపతులను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పెదపాలెంలో శ్రీ భ్రమరాంబాసమేత మల్లిఖార్జున స్వామి, గ్రామ దేవతులు, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సహిత అష్టనాగ మానసాదేవి, నాభిశిల, నవగ్రహ, జీవ ధ్వజ, ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రకాల హోమాలు, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమాలు చేపట్టారు. అష్టోత్తర శతనామార్జనలు నిర్వహించారు. వేదపఠన చేశారు. పలు గ్రామాల నుంచి భక్తుల వేల సంఖ్యలో హాజరైనారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి 3 గంటలవరకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మిట్టపాలెంలో.....

మిట్టపాలెంలో కొలువై ఉన్న శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామివారి దేవాలయం, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా జరిగాయి. వేదపండితుల వేద మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ట మహోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తుల హాజరై స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలు, అభిషేకాలలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు పాల్గొన్నారు.



పెదపాలెంలో జరిగిన ప్రతిష్ట మహోత్సవాల్లో ఎమ్మెలే శంకరరావు దంపతులు

మహిళలకు ప్రభుత్వ సంక్షేమపథకాలపై అవగాహన

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ప్రభుత్వం అందించే రుణాలను సక్రమంగా వినియోగించుకుని కుటుంబ ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని ఐకేపీ ఏపీఎం బాలస్వామి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం ఆర్బీకేలో డీబీఆర్సీ ఆధ్వర్యంలో దళిత ఆదివాసి మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. సదస్సులో ఏపీఎం బాలస్వామి మాట్లాడుతూ ఎస్హెచ్జీల ద్వారా శ్రీనిధి, ఉన్నతి ద్వారా రుణాలు తీసుకుని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే బ్యాంకులు మరింత రుణసాయం అందిస్తుందన్నారు. డీబీఆర్సీ మహిళాకోఆర్డినేటర్ మేడెవెంకటరమణ మాట్లాడుతూ పరిశ్రమలశాఖ ద్వారా 35% సబ్సిడీతో రుణాలు అందిస్తున్నారని, మ్యానుఫ్యాక్చరింగ్ వర్క్ చేసుకునేవారికి ఈ అవకాశం బాగుంటుందన్నారు. అలాగే స్కిల్ డెవలప్మెంట్ ద్వారా చదువుకునిఖాళీగా ఉన్న యువతకు శిక్షణ, మహిళలకు టైలరింగ్ లేదా పచ్చళ్ళ తయారీ లాంటివాటిపై అవసరమైన శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీసీలు నాగరాజు, నాగమల్లేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రాములమ్మ, ఆయా గ్రామాల యానిమేటర్లు పాల్గొన్నారు.



చాగంటివారిపాలెం ఆర్బీకేలో అవగాహన కల్పిస్తున్న ఏపీఎం బాలస్వామి

కౌలు రైతు కార్డుపై అవగాహన

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): కౌలుకార్డు(పంటసాగు హక్కుపత్రం) వల్ల భూయజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని దమ్మాలపాడులో పంటసాగుహక్కుపత్రం పై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో ఏ.ఓ అరుణ మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు సీసీఆర్సీ పొందుటకు అర్హులేనన్నారు. ఇది కేవలం భూయజమానికి, సాగుదారునికి మధ్య ఉండే ఒప్పందం మాత్రమే అన్నారు. ఒప్పంద పత్రం కాలపరిమితి జారీ చేసిన దగ్గర నుంచి 11 నెలలు మాత్రమే అన్నారు. పంట రుణాలు, పంటల నమోదు, పంటల బీమా వర్తిస్తుందన్నారు. పంటలకు మార్కెట్లో ధర లేనప్పుడు ప్రభుత్వం వారు ప్రకటించిన మద్దతు ధరకు ఆర్బీకేలో అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, సర్పంచ్ కే.ఏడుకొండలు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కళ్ళంశివరామిరెడ్డి, కళ్ళంకోటిరెడ్డి, బద్ది గంజగన్నాథరెడ్డి, వీఆర్వో హరిబాబు, వీహెచ్ఏ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆర్బీకేలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ అరుణ, తహసీల్దార్ భవానిశంకర్

కౌలురైతు చట్టాన్ని సవరించాలని వినతి

సత్తెనపల్లి: కౌలు రైతు చట్టాన్ని (సీసీఆర్సీ) సవరించి భూ యజమాని సంతకం తొలగించి కౌలు రైతుల జీవితాలను కాపాడాలని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామ వీఆర్ఓకి గురువారం రైతు సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల కుటుంబాలు అంటే కోటి మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. పంట సాగు చేసే ప్రతి కౌలు రైతుకి గుర్తింపు కార్డు వచ్చే విధంగా చట్టాన్ని చేయాలన్నారు. యజమాని సంతకం ఉంటేనే కౌలు కార్డులు ఇస్తామని ప్రభుత్వాలు ముడి పెట్టడంతో కౌలు రైతు కార్డులు పొందలేక పోతున్నారన్నారు. భూయజమానులు అగ్రిమెంటు ఉంటేనే అని చట్టంలో పొందు పరచడంతో భూ యజమానులు అంగీకరించకపోవడంతో అనేకమందికి కౌలు కార్డులు రాక ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా, ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, తదితర పథకాలు అందక కౌలుదారులు నష్టపోతున్నారన్నారు. అందుకే కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జీపు యాత్రలు, పాదయాత్రలు జరుగుతున్నాయిని, జీపు యాత్రలో భాగంగా ఈ నెల 9వ తేదీనా సత్తెనపల్లికి వస్తుందన్నారు. జీపు యాత్రలో కౌలు రైతులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దుగ్గి మేరమ్మ, రైతు సంఘం నాయకులు మక్కపాటి నరసింహరావు, రావూరి పూర్ణచంద్రరావు, బొల్లేపల్లి రామారావు, షేక్ హుస్సేన్ సా, వంగర తులసి, గ్రామ కౌలు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న కౌలు రైతులు

బాల కార్మిక రహిత సత్తెనపల్లి కోసం కృషి చేద్దాం

సత్తెనపల్లి: బాల కార్మిక రహిత సత్తెనపల్లికి ప్రతి ఒక్కరం కలిసి కట్టుగా కృషి చేద్దామని న్యాయవాది పెండ్యాల భరత్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ డి. నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు బాలకార్మిక వ్యవస్థను అరికట్టేందుకు జరుగుతున్న ప్రత్యేక డ్రైవ్లో భాగంగా గురువారం పట్టణంలోని 27 వ వార్డులో గల మూడవ సచివాలయం పరిధిలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ చుట్టుపక్కల ఉన్న పిల్లలను బాల కార్మికులుగా మారిస్తే సత్తెనపల్లి కార్మిక శాఖ వారికి, సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ దృష్టికి తీసుకు రావాలన్నారు. దీని వల్ల సత్తెనపల్లి పట్టణం బాల కార్మిక రహిత పట్టణంగా రికార్డు అవుతుందన్నారు. ముందుగా ఆ ప్రాంతంలో ఈ టీం తిరిగి అక్కడ ఎవరైనా బాల కార్మికులుగా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా తాము వెళ్లిన తరువాత అయినా బాల కార్మికులు ఉంటే ఎవరి దృష్టికి తేవాలో అక్కడ ఉన్న ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కోటగిరి లక్ష్మణ్, కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి, మూడవ సచివాలయ కార్యదర్శి సయ్యద్ సహన, పారా లీగల్ వలంటీర్లు షేక్ ఖాజా,షేక్ ముబారక్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది పెండ్యాల భరత్